క్లుప్తంగా

నాసా కిట్ల పంపిణీ



నిజామాబాద్ రూరల్: మండలంలోని పాంగ్రా శివారులో ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులకు జోనల్ ఏజీఎం జితేందర్ నాసా కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నాసా ప్రాజెక్టులో ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాబోయే తరాలు, ప్రపంచ దేశాలు గర్వించే శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. జీఎం నాగేంద్ర, చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ప్రిన్సిపల్ రామకృష్ణ, కో–ఆర్డినేటర్ నరేందర్, డీన్ క్రాంతి, నాసా ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సంగీతతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు చైతన్య ర్యాలీ



ఖలీల్‌వాడి: నగరంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2 ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు చైతన్య ర్యాలీని తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. నాందేవ్‌వాడ, హమాల్‌వాడి, బస్టాండ్, గంజ్ మీదుగా దుబ్బ వరకు ర్యాలీ కొనసాగింది. ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్‌రావు, కళాశాల కార్యదర్శి సుజన్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి దత్తు, అధ్యాపకులు వేణుగోపాల్, రచన, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనలో విఫలం




ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలో మున్సిపాలిటీగా ఏర్పడి కార్పొరేషన్ స్థాయికి చేరినప్పటికీ ప్రభుత్వాలు, అధికారులు సౌకర్యాల కల్పనలో విఫలమయ్యారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నగర కమిటీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో మార్నింగ్ వాకర్స్‌తో, కోటగల్లి, ఇంద్రాపూర్, నాందేవ్ వాడ ప్రాంతాల్లో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీగా ఏర్పడి 92 సంవత్సరాలు కావస్తున్నా, ఇప్పటికీ నగర ప్రజలకు ఇప్పటికీ స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల కోసం వచ్చేవారిని నిలదీయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆల్గోట్ రవీందర్, నాయకులు కే గణేశ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోదావరి, సంధ్యారాణి, పీవైఎల్ నాయకులు జైత్రామ్, అబ్బు, మహేశ్, కుమార్, సందీప్, రాజేశ్, సుజాత, లక్ష్మి, శైలజ, ఆదిత్య పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గౌరవం



నిజామాబాద్ సిటీ: విద్యార్థులు ఉన్నత చదువు చదివితేనే సమాజంలో గౌరవం దక్కుతుందని నిజామాబాద్ మహిళా కళాశాల(కంఠేశ్వర్) అధ్యక్షుడు ఎం రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అబ్దుల్ కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుంటేనే సమాజంలో ఉన్నత స్థానం దక్కుతుందన్నారు. ఫౌండేషన్ ట్రైనర్ నరేశ్, కరస్పాండెంట్ కిషన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ పద్మనాభరెడ్డి, ప్రిన్సిపల్ భారతిరెడ్డి, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో చేరికలు



నిజామాబాద్‌నాగారం: కాంగ్రెస్‌కు మాల మహానాడు అండగా ఉండి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తుందని మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల కిష్టయ్య అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి షబ్బీర్‌అలీ సమక్షంలో కిష్టయ్యతో పాటు వందమందికిపైగా కాంగ్రెస్‌లో చేరారు.

బీఆర్ఎస్‌లో..

నగరంలోని 39వ డివిజన్ చంద్రశేఖర్ కాలనీకి చెందిన 400 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదు

- ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



యానంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత



బాజిరెడ్డి గోవర్ధన్‌కు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): దేశంలో ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమేనని, అవసరమైతే యువత గూగుల్ సెర్చ్ చేసి చూడాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. డిచ్‌పల్లి మండలం యానంపల్లిలో బీఆర్ఎస్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా కవిత శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 2.32 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేసి అందులో 1.60 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. కాంగ్రెస్ వాళ్లు కేసులు వేయడంతో మిగతా ఉద్యోగాలు పెండింగ్‌లో పడ్డాయని, ఆ విషయం మీ అందరికీ తెలిసిందేనన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ఏడు సంవత్సరాలు కొట్లాడి ప్రభుత్వ ఉద్యోగాల్లో 95 శాతం స్థానికులకే ఇవ్వాలని రాష్ట్రపతి ద్వారా మార్పులు చేయించి కేంద్రం నుంచి జీవో తెచ్చుకున్నామన్నారు. రాష్ట్రంలో మంచి శాంతిభద్రతల పరిరక్షణ బాగుండడంతో గూగుల్ వంటి పెద్దపెద్ద కంపెనీలు హైదరాబాద్‌కు వస్తున్నాయన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, 9గంటలు కరెంట్ ఇస్తామని మూడు గంటలు కూడా ఇవ్వడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 24గంటల విద్యుత్, ఇంటి వద్దకే నీళ్ల సరఫరా చేస్తున్నదని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ ఉండదని, మరోసారి భయంకర పరిస్థితి వస్తుందన్నారు. పదేళ్ల కిత్రం ఎట్లున్నాం? ఇప్పుడు ఎట్లున్నాం? అని ఆలోచన చేయాలని సూచించారు. నిజామాబాద్ రూరల్‌లో బాజిరెడ్డి గోవర్ధన్‌ను మూడోసారి గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ పింఛను వస్తుందన్నారు. తెల్లరేషన్‌కార్డులతోపాటు ఆడబిడ్డలకు పింఛన్లు ఇస్తామనన్నారు. అనంతరం బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. హనుమంతుడు లేని గ్రామం లేదు.. సంక్షేమ పథకం అందని ఇల్లు లేదన్నారు. రూరల్‌నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని మిట్టాపల్లి, కమలాపూర్, నర్సింగాపూర్, రాంపూర్, రాంపూర్‌తండా, బీబీపూర్, బీబీపూర్ తండ, యానంపల్లి గ్రామాల్లో బాజిరెడ్డి గోవర్ధన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రూరల్ ఇన్‌చార్జి వీజీగౌడ్, సర్పంచులు తెలు గణేశ్, నర్సయ్య, తిరుపతి, నడిపన్న, గోపు చిన్నుబాయి, జెడ్పీటీసీ దాసరి ఇందిరాలక్ష్మీనర్సయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు చింత శ్రీనివాస్‌రెడ్డి, గజవాడ జైపాల్, తారాచంద్, ఒడ్డెం నర్సయ్య, సాయిలు, కృష్ణ, అమీర్, పద్మారావు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి మండలంలో..

ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లి, సిర్నాపల్లి, మేఘ్యానాయక్ తండా, గన్నారం గ్రామాల్లో బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రూరల్‌నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్ మాయమాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. మండలానికి డీసీఎంఎస్ చైర్మన్ పదవి ఇచ్చామన్నారు. మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఎంపీపీ రమేశ్‌నాయక్, సర్పంచ్ నోముల విజయలక్ష్మారెడ్డి, వైస్ ఎంపీపీ అంజయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దాసు పాల్గొన్నారు.

అభ్యర్థుల మాటల్లో వాస్తవాలు గ్రహించాలి

- మంచి ఆలోచనతో ఓటు వేయాలి
- మీట్‌ది ప్రెస్‌లో ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న బిగాల గణేశ్‌గుప్తా

నిజామాబాద్‌నాగారం: ఎన్నికలు అనగానే ఎవరైనా పోటీ చేయొచ్చని, అభ్యర్థులు చెప్పే మాటల్లో వాస్తవాలను ప్రజలు గ్రహించాలని అర్బన్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. పార్టీలు, ప్రతిపక్షాలను పక్కనపెట్టి ప్రజలను, భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి చేశానని, మంచి ఆలోచనతో ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో బిగాల మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించానని, రైతుగా, వ్యాపారవేత్తగా రాణించానని, తమ తాతల నుంచి రాజకీయరక్తం తమలో ఉందన్నారు. 10 ఏళ్లుగా నగరంలో మౌలికసదుపాయాలు కల్పించడానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి సమస్యలను పరిష్కారించానని తెలిపారు. నగరంలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం కృషి చేస్తానని తెలిపారు. మిషన్ భగీరథ లైన్ కోసం రూ.20 కోట్లు మంజూరు చేయించామని, అర్గుల్ నుంచి నిజామాబాద్ వరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని తీసుకువచ్చి నగర ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. మరోసారి గెలిపిస్తే రాష్ట్రంలోనే ఉత్తమ నగరంగా నిజామాబాద్‌ను తీర్చిదిద్దుతానని, అభివృద్ధి కొనసాగాలన్నా, 24 గంటల నీటి సరఫరా జరగాలన్నా, యూజీడీ పూర్తి కావాలన్నా ప్రజలు బీఆరెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మెజారిటీ, మైనారిటీ అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేశానన్నారు.

అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను గెలిపించాలి

నిజామాబాద్ నగరం మరింత అభివృద్ధి చెందడం కోసం బీఆర్ఎస్‌ను మరోసారి గెలిపించాలని బీఆర్ఎస్ అర్బన్ అభ్యర్థి బిగాల గణేష్‌గుప్తా కోరారు. నగరంలోని ఆర్ఎన్ కన్వెన్షన్ హాలులో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా, బిగాల పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాల కొనసాగింపు కోసం కారుగుర్తుకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మేయర్ దండు నీతూకిరణ్ , సిర్ప రాజు, అసోసియేషన్ అధ్యక్షుడు పుల్గం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్‌లో ఎన్ఆర్ఐల ప్రచారం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ ఉద్యమంలో ప్రవాస భారతీయులు ముందున్నారని, అర్బన్‌లో ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తాను హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించడానికి ఎన్ఆర్ఐలు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ ఎన్ఆర్ఐ గ్లోబల్ కో ఆర్డినేటర్ మహేశ్‌బిగాల అన్నారు. నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయడానికి 52 దేశాల ప్రతినిధులం పనిచేస్తున్నామన్నారు. ఎన్ఆర్ఐలు నిజామాబాద్ నగరంలో 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ప్రచారం చేశారన్నారు. నగరంలో జరిగిన అభివృద్ధిని పరిశీలించి మళ్లీ ఎన్నికల్లో ప్రచారం చేయడానికి ఎన్ఆర్ఐలు వచ్చారన్నారు. కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ నాయకుడు కామారెడ్డిలో ఓట్లు అడిగే ముఖం లేక కేసీఆర్‌ని చూసి ఓడిపోతాననే భయంతో నిజామాబాద్‌కు వచ్చి పోటీ చేస్తున్నారన్నారు. బీజేపీ చేసింది, చెప్పుకోవడానికి ఏమీ లేక మతం పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నగర ప్రజలు చైతన్యవంతులని అభివృద్ధి, సంక్షేమానికి మద్దతుగా నిలుస్తూ కారు గుర్తుకి ఓటు వేసి గణేశ్‌బిగాలను గెలిపించాలని కోరారు. ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్, ఎన్ఆర్ఐలు పాల్గొన్నారు.

బీడీలపై నిషేధానికి బీజేపీ ప్రయత్నం



గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

- కాంగ్రెస్, మిత్రపక్షాలు అడ్డుకున్నాయి
- అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న ఆరెకటికలు

ఖలీల్‌వాడి: పార్లమెంట్‌లో బిల్లుపెట్టి బీడీలపై నిషేధం విధించేందుకు నరేంద్ర మోదీ నేతృత్వంలోనే బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తే కాంగ్రెస్‌తో పాటు మిత్రపక్షాలు రాష్ట్రపతివద్దకు వెళ్లి అడ్డుకున్నాయని నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ అన్నారు. శుక్రవారం నగరంలోని మారుతినగర్‌లో ఆయన బీడీ కార్మికులతో సమావేశమయ్యారు. అలాగే వినాయక్‌నగర్ మున్నూరుకాపు సంఘ భవనంలో నిర్వహించిన గౌడ ఆత్మీయ సమ్మేళనం, కసాబ్ గల్లీలో నిర్వహించిన ఆరెకటిక ఆత్మీయ సమ్మేళనంలో షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమంలో షబ్బీర్ మాట్లాడారు. రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్రలో బీడీ కార్మికులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని చలించిపోయారన్నారు. తెలంగాణలో లక్షలాది కుటుంబాలకు బీడీ పని తప్ప వేరే మార్గం లేదన్నారు. సిగరెట్ కూడా పొగాకు సంబంధించిందే అయినప్పటికీ దాన్ని రద్దు చేయకుండా, పేదలకు ఉపాధి కల్పించే బీడీ వ్యవస్థను రద్దుచేసి లక్షలాది కుటుంబాలను రోడ్డున పడేసేందుకు సిగరెట్ కంపెనీలతో బీజేపీ ప్రభుత్వం కుమ్మక్కైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీడీ కార్మికులను ఆదుకొని వారికి ఆరోగ్య భద్రత కల్పించి కుటుంబాలను ఆదుకుంటామన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం గ్రామాల్లో బెల్ట్‌షాపులు, చీప్ లిక్కర్ తీసుకొచ్చి గౌడ కులస్తుల కడుపు కొట్టిందని, పేదలను తాగుడికి బానిసలను చేసి వారి ఉసురు తీసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెట్టు పన్ను రద్దు, సొసైటీ పునరుద్ధరణ, ఆటోమేటిక్ రెన్యువల్‌ను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. వైన్‌షాపుల్లో రిజర్వేషన్‌ను పెంచుతామని, ఎక్సైజ్ అధికారులు గౌడకులస్తుల వైపు కన్నెత్తి చూడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరెకటికలకు రాజ్యాధికారంలో వాటా, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు కలను సాకారం చేసుకోవచ్చన్నారు. యాటలను మండీల నుంచి తెచ్చే సమయంలో ప్రమాదానికి గురైతే వాటికి నష్టపరిహారం అందించేందుకు కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ఆరెకటికలను ఓటు బ్యాంకుగా వాడుకున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ఆరెకటికల కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు.

ప్రశాంతంగా ఓట్ ఫ్రం హోం




సిరికొండ/జక్రాన్‌పల్లి/మోపాల్: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఓట్ ఫ్రం హోం శుక్రవారం ప్రశాంతంగా కొనసాగింది. సిరికొండ మండలం తాటిపల్లిలో ఇద్దరు, జంగిడిలోడి తండాలో ఇద్దరు, కొండూర్‌లో ఒకరు, జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్‌లో శతాధిక వృద్ధురాలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మోపాల్ మండలంలో 68 మంది ఓట్లు వేశారు.

మనందరిదీ భగవంతుని కుటుంబం



నిజామాబాద్ సిటీ: సమాజంలోని ప్రతి ఒక్కరూ భగవంతుని కుటుంబమేనని, అందరూ కలిసి ఉండాలని శ్రీ త్రిదండి చినరామానుజ జీయర్ స్వామి అన్నారు. నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీ సీతారామచంద్ర స్వామి పవిత్రోత్సవాలకు చినజీయర్ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ధర్మం, కర్మ, సంప్రదాయం, సంస్కృతి ఇది అని తెలియజేసే కేంద్రాలుగా ఆలయాలను తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సరళ మహేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం స్వామిజీ మారుతినగర్‌లోని భక్తుడు గడీల రాములు ఇంట్లో బస చేశారు. శనివారం నిర్వహించనున్న కార్యక్రమాల్లోనూ స్వామిజీ పాల్గొననున్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న చెరుకు రాంచందర్

నిజామాబాద్‌నాగారం: బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని, ఆ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దన్నారు. అన్ని వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి, హైదరాబాద్‌లో 125 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయమన్నారు. మాలల 19 డిమాండ్లను కేసీఆర్ తప్పకుండా అమలు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు దండు చంద్రశేఖర్, రాజేంద్రప్రసాద్, జేఏసీ కన్వీనర్ కనక రాజు, వైస్ చైర్మన్ అనిల్, సుంకరి మల్లేశ్, రవి, సాయికృష్ణ, హరీశ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల బాధ్యత నాదే

- 24ఏళ్లుగా ట్రస్ట్ ద్వారా సేవ చేస్తున్నా..
- బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ



ధన్‌పాల్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్లు ఇప్పించే బాధ్యత తనదేనని బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ హామీ ఇచ్చారు. శుక్రవారం నగరంలోని 20వ డివిజన్ ఎల్లమ్మగుట్టలో హనుమాన్ మందిరం నుంచి ధన్‌పాల్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ న్యాలం రాజు గజమాలతో ఆయనను సన్మానించగా, మహిళలు బోనాలతో స్వాగతం పలికారు.. ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. నగరంలో అన్నివర్గాల ప్రజల నుంచి అనూహ్యస్పందన వస్తున్నదన్నారు. ఏ డివిజన్‌కు వెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. 24 ఏళ్లుగా ట్రస్ట్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నానని, ఆలయాల అభివృద్ధి, పేద విద్యార్థుల చదువు, వినాయక మండపాలకు ఆర్థిక సాయం, దేవీమాతలకు పట్టుచీరల పంపిణీ, ఇతర అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అందరితో కలిసిఉన్న తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీతోనే దేశానికి రక్షణ అని, దేశం కోసం, ధర్మం కోసం పని చేసే పార్టీ బీజేపీ అని అన్నారు. కేసీఆర్ మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టారని, ఈసారి ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటేస్తే వృథా అవుతుందని, కమలం పువ్వు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ న్యాలం సునీత, నాయకులు సురేశ్, స్రవంతి రెడ్డి, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



బోనాలతో ధన్‌పాల్ సూర్యనారాయణకు స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రజాధనం నీళ్లపాలు చేశారు

- రూరల్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ భూపతిరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రాజుల పైసలు రాళ్లపాలైనట్లు.. కాళేశ్వరం వంటి నాణ్యతలేని ప్రాజెక్టులు కట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజాధనాన్ని నీళ్లపాలు చేసిందని నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి విమర్శించారు. ఎన్నో ఏళ్ల క్రితం కట్టిన ఎస్సారెస్పీ చెక్కుచెదరకుండా ఉంటే ఇటీవలే కట్టిన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి మండలంలోని నాకాతండా, వెస్లీనగర్ తండా, సుద్దపల్లి, నడిపల్లి తండా, కమలాపూర్, నర్సింగాపూర్, రాంపూర్, బీబీపూర్, బీబీపూర్ తండాల్లో భూపతిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భూపతిరెడ్డికి మంగళహారతులు, బోనాలతో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చినా బాజిరెడ్డి గోవర్ధన్ నియోజకవర్గం అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. గ్రామాల్లో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను కూడా బాజిరెడ్డి పట్టించుకోలేదని, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే కమలాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకుంటానని హామీ ఇచ్చారు. బాజిరెడ్డి ఆర్టీసీ చైర్మన్‌గా ఉండి కూడా కమలాపూర్ గ్రామానికి బస్సు రాకుండా చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, సీనియర్ నాయకులు పాలసాని శ్రీనివాస్, న్యాస రాజేశ్వర్, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, వాసుబాబు, పెద్దోళ్ల శ్రీనివాస్, ఇబ్రహీం, రాజన్న,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవనగర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ వేణుతోపాటు 50 మంది నాయకులు బీజేపీని వీడి భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భూపతిరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పాదుకల శోభాయాత్ర

రెంజల్(బోధన్): అయోధ్య శ్రీరాముని పాదుకలతో రెంజల్‌లోని ప్రధాన వీధుల్లో మహిళలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శోభాయాత్ర నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రామనామస్మరణతో రెంజల్‌లోని వీధులు మారుమోగాయి.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,300	వెండి (కిలో)	78,000
22 క్యారెట్స్	57,440	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు	డ్రెస్స్‌డ్	180
	(కిలోకు)	లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	28	50	గాజరుగడ్డ	40	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
జీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	16	30
బీర్నిసుకాయ	50	70	గోబిగడ్డ	20	40
కాకరకాయ	30	60	గోబిపువ్వు	30	50
వంకాయ	10	20	బీట్‌రూట్	30	60
పాలకూర	10	20	కరివేపాకు	60	80
మెంతికూర	20	40	చామగడ్డ	40	60
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	70	చిక్కుడుకాయ	20	40
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఫిషియన్)

స్క్రీన్-2	ఆదికే శవ(తెలుగు)-10.40,1.35 7.25,10.30 సౌండ్ పార్టీ(తెలుగు)-4.30
స్క్రీన్-3	కోటా బొమ్మాళి పీఎస్(తెలుగు)-10.35, 4.25,10.25 మంగళవారం(తెలుగు)-1.30 మాధవే మధుసూదనా(తెలుగు)-7.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆదికేశవ(తెలుగు)-11.00,1.50, 4.40,7.30,10.20
స్క్రీన్-2	కోటా బొమ్మాళి పీఎస్(తెలుగు)-10.00, 1.00,7.10,10.10 మంగళవారం(తెలుగు)-4.00
స్క్రీన్-3	టైగర్-3(హిందీ)-12.40,6.45 కోడా కోలా(తెలుగు)-4.05 మంగళవారం(తెలుగు)-10.10
స్క్రీన్-4	టైగర్-3(హిందీ)-10.05 సౌండ్ పార్టీ(తెలుగు)-1.40 మాధవే మధుసూదనా(తెలుగు)-4.25
దేవి	ఆదికేశవ(తెలుగు)
నటరాజ్	కోట బొమ్మాళి పీఎస్(తెలుగు)
లలితామహల్	భగవంత్ కేసరి(తెలుగు)
విజయ్	మంగళవారం(తెలుగు)